www.kalamdaily.com
Follow on: Kalamtelugu
# కలం
ప్రజల గళం...
23-02-2026, సోమవారం పేజీలు: 3

360° SINGLE TOPIC

## బెనిఫిట్స్-పెండింగ్



ఎంప్లాయిస్ vs సర్కార్

# సహనమా.. సమరమా..!

తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాత్రను ప్రజలు కళ్లారా చూశారు. ప్రభుత్వ నిర్వహణలోనూ వారిదే కీలక భూమిక. విద్య, వైద్యం మొదలు.. రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం వరకు ప్రభుత్వ ఫలాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలంటే వీరి కృషి తప్పనిసరి. కొన్ని సందర్భాల్లో పవర్‌లోకి ఏ పార్టీ రావాలో ఉద్యోగులే డిసైడ్ చేస్తారనేది బహిరంగ రహస్యం. అందుకే వారి డిమాండ్ల విషయంలో ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉంటాయి. వెంటవెంటనే పరిష్కరించాలని భావిస్తాయి. కొత్త రాష్ట్రమైనప్పటికీ ఎక్కువ వేతనాలు ఫిక్స్ చేసింది అప్పట్లో సర్కార్. అయినా డీఏలు, పీఆర్సీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లాంటివి అపరిష్కృతంగా ఉండిపోయాయి. వీలైనంత తొందరగా పరిష్కరించాలన్నది ఉద్యోగ సంఘాల డిమాండ్. ఆర్థిక గడ్డు పరిస్థితులను అర్థం చేసుకోవాలన్నది ప్రభుత్వ వాదన. ప్రస్తుతానికి ఇరువైపులా సహనం, సంయమనమే ఉన్నా 'ముగింపు ఎప్పటికి' అనేది అస్పష్టం. వీటన్నింటిపై

**కలం 360 డిగ్రీస్ సమగ్ర కథనం..**

తెలంగాణ బ్యూరో, కలం

| | | | | |
|---|---|---|---|---|
| రాష్ట్ర ఉద్యోగులకు సర్కార్ బాకీ రూ.25వేల కోట్లు | 4 డీఏలు, కొత్త పీఆర్సీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెండింగ్ | రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులు | వాయిదాల పద్ధతిలో కొనసాగుతున్న చెల్లింపులు | వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కోసం ఉద్యోగుల డిమాండ్ |

అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, డిమాండ్లను కొలిక్కి తేవాలంటూ ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలు వరుస విజ్ఞప్తులు చేస్తున్నాయి. అనేక అంశాలు ఉన్నా మూడింటిపైనే ఎక్కువ దృష్టి పెట్టాయి.

### ఆ మూడే కీలకం

1. నాలుగు పెండింగ్ డీఏల పేమెంట్స్
2. కొత్త పీఆర్సీ అమలు
3. రిటైర్ అయిన ఉద్యోగులకు వెంటవెంటనే బెనిఫిట్స్ ఇవ్వడం

ఇవి అమలైతే సుమారు మూడున్నర లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులు, దాదాపు మూడు లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందుతారు. ఏటా రిటైర్ అవుతున్న సుమారు 9 వేల మంది ఉద్యోగులకు సెటిల్‌మెంట్ బెనిఫిట్స్ పేరుతో ప్రభుత్వం ఆరేడు వేల కోట్లను వెచ్చించక తప్పదు. ఖజానాపై భారం పడుతున్నా అవన్నీ తమ హక్కులన్నది ఉద్యోగ సంఘాల వాదన. ఇవ్వాలని భావిస్తున్నప్పటికీ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందన్నది ప్రభుత్వ వివరణ.

### పెండింగ్‌లో 4 డీఏలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే నాటికి మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటొక్కటిగా క్లియర్ చేసింది. ఈలోపే కొత్త డీఏలు వచ్చిపడ్డాయి. దీంతో ఇంకా నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని క్లియర్ చేసేలోపు మళ్లీ కొత్తవి చేరతాయి. ఒక్కో డీఏకు ఖజానాపై ప్రతి నెలా యావరేజ్‌గా రూ. 290 కోట్ల చొప్పున సంవత్సరానికి దాదాపు మూడున్నర వేల కోట్ల భారం పడుతుంది. ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు తగ్గట్టు ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఆరు నెలలకు ఒక డీఏ ప్రకటిస్తాయి. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ఒకేసారి క్లియర్ చేస్తే ప్రభుత్వంపై నెలకు వెయ్యి కోట్లకు పైగానే భారం పడుతుంది.




### డీఏల పెండింగ్‌లో తెలంగాణ టాప్


దేశంలోనే అత్యధిక డీఏలు బాకీ ఉన్న రాష్ట్రంగా తెలంగాణ (4) నిలిచింది. ఏపీలో 2, బిహార్‌లో 2, రాజస్థాన్, గుజరాత్‌లో ఒకటి పెండింగ్‌లో ఉన్నాయి.

### నమ్మకం లేకనే బీఆర్ఎస్‌పై ఆగ్రహం

రాష్ట్రం వచ్చాక అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. స్పెషల్ ఇన్సెంటివ్ పేరుతో 43% ఫిట్‌మెంట్ ప్రకటించింది. ఒకవైపు కేంద్ర ఉద్యోగులకు సమానంగా, ఇతర రాష్ట్రాల్లోని ఉద్యోగులకంటే ఎక్కువ వేతనాన్ని అందించింది. ఫస్ట్ పీఆర్సీ కేవలం 7.5% ఫిట్‌మెంట్ సిఫారసు చేసినా 30% ఇచ్చింది. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు సెకండ్ పీఆర్సీలో 5% ఇంటెరిమ్ రిలీఫ్ ప్రకటించింది. అప్పటికే ఉద్యోగులకు జీతం ఏ తేదీన అందుతుందో తెలియని గందరగోళం. మూడు డీఏల అమలు పెండింగ్‌లోనే. దీంతో అప్పటి సర్కార్‌పై ఉద్యోగులు నమ్మకం కోల్పోయారు. ఉద్యోగులు కూడా వ్యతిరేకంగా పనిచేశారంటూ ఆ పార్టీ లీడర్లే ఓపెన్ కామెంట్ చేశారు. ఇప్పుడు ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు అందుతున్నా డీఏల పెండింగ్, పీఆర్సీ అమలులో జాప్యం వారిని అసంతృప్తికి గురిచేస్తున్నాయి.

### పీఆర్సీ ఫిట్‌మెంట్


కేంద్ర ప్రభుత్వం ప్రతి పదేండ్లకోసారి ఉద్యోగుల వేతన సవరణ కోసం కమిషన్ వేసి ఆ సిఫారసుల మేరకు నిర్ణయం తీసుకుంటుంది. రాష్ట్రంలో ప్రతి ఐదేండ్లకోసారి పీఆర్సీ ఆనవాయితీ అయింది. రాష్ట్రంలో సుమారు 3.5 లక్షల మంది రెగ్యులర్ సర్వీస్ ఉద్యోగులు, 3 లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు. పీఆర్సీ ద్వారా కనీసంగా 30% ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరుతున్నారు. ఒక్కో పర్సెంట్‌కు నెలకు రూ. 100 కోట్లకు పైగానే ప్రభుత్వం అదనంగా చెల్లించాల్సి వస్తున్నది. ఏటా సగటున రూ. 1,250 కోట్ల భారం పడుతుంది. 30% ఫిట్‌మెంట్ ఖరారైతే ప్రభుత్వం దాదాపు రూ. 38 వేల కోట్లను వెచ్చించక తప్పదు. షెడ్యూలు ప్రకారం 2023 జూలై నుంచే పీఆర్సీ అమలులోకి రావాల్సి ఉన్నది. కానీ ఇంకా నివేదిక సమర్పించకపోవడంతో పెండింగ్‌లో పడింది.




మరిన్ని వివరాలు 2,3 పేజీల్లో..

### ఉద్యోగులకు రావాల్సినవి ఇవీ!

- ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ బకాయిల అంచనా రూ. 9,000 కోట్లు. ఇందులో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, జీపీఎఫ్, జీఎల్ఐ లాంటివి ఉన్నాయి.
- ఇవికాక ఇంతే మొత్తంలో నాలుగు డీఏల పెండింగ్, కొన్ని ఇతర బిల్లుల బకాయిలున్నాయి. రాబోయే సంవత్సరంలో సుమారు 9,900 మంది రిటైర్ కానుండడంతో సుమారు రూ. ఆరేడు వేల కోట్లు బెనిఫిట్స్ సెటిల్‌మెంట్ కోసం అవసరం. ఇవన్నీ కలిపి మొత్తంగా దాదాపు రూ. 25 వేల కోట్లు ఉండొచ్చని అంచనా!




- గత కొంతకాలంగా మెడికల్ రీయింబర్స్‌మెంట్, సప్లిమెంటరీ శాలరీ బిల్లులు గ్రీన్ చానెల్ ద్వారా ఎప్పటికప్పుడు క్లియర్ అవుతున్నాయి.
- రెండున్నరేండ్లలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున ఈ లోగానే ప్రభుత్వం అన్నీ క్లియర్ చేస్తుందన్నది ఉద్యోగ సంఘాల అభిప్రాయం. వీటితో పాటు రెండో పీఆర్సీ ఫిట్‌మెంట్ కూడా సంతృప్తికరంగా ఇస్తుందన్నది వాటి విశ్వాసం.

కలం
ప్రజల గళం...
23-02-2026, సోమవారం
360° SINGLE TOPIC

# బెనిఫిట్స్-పెండింగ్

## బిల్లుల చెల్లింపులన్నీ పెండింగ్




ఉద్యోగులకు వారి అవసరాల మేరకు రావాల్సిన బిల్లుల చెల్లింపులు కూడా పెండింగ్‌లో పడ్డాయి. సప్లిమెంటరీ శాలరీ, అరియర్స్, గ్రాట్యుటీ, సరెండర్ లీవ్స్, మెడికల్ రీయింబర్స్ మెంట్, జీపీఎఫ్ అడ్వాన్స్, విత్‌డ్రాయల్, జనరల్ లైఫ్ ఇన్సూరెన్స్, గ్రూప్ ఇన్సూరెన్స్, ట్రావెల్ అడ్వాన్స్, ఎల్‌టీసీ, ఫెస్టివల్ అడ్వాన్స్, కంటింజెంట్ బిల్స్, పెన్షన్ కమ్యూటేషన్.. ఇలా మొత్తం 18 రకాల బిల్లుల చెల్లింపులు పెండింగ్‌లో పడ్డాయి. ఆర్థిక శాఖ టోకెన్లు జారీచేసినా ట్రెజరీలో నిధుల లభ్యత లేకపోవడంతో పేమెంట్స్ అంతంతమాత్రమే. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందుకోకుండానే సుమారు 60 మంది ఉద్యోగులు వేర్వేరు కారణాలతో చనిపోయారు. మిస్ వరల్డ్, భారత్ సమిట్, గ్లోబల్ సమిట్, మూసీ పునరుజ్జీవం, గాంధీ విగ్రహం ఏర్పాటు.. ఇలాంటివాటికి నిధులివ్వడంపై ఉన్న శ్రద్ధ ఉద్యోగుల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సెటిల్‌మెంట్‌పై లేదనే నిందను ప్రభుత్వం ఎదుర్కొంటున్నది.

## వన్‌టైమ్ సెటిల్‌మెంట్ వాదన



ఉద్యోగులకు రావాల్సిన నాలుగు డీఏల బకాయిలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఈహెచ్‌ఎస్, పెండింగ్ బిల్లుల పేమెంట్స్.. ఇవన్నీ వన్ టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో ప్రభుత్వం క్లియర్ చేస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నది ఉద్యోగ సంఘాల వాదన. ఇందుకోసం గత మూడేండ్లుగా పేరుకుపోయిన అన్ని రకాల బకాయిలకు రూ. 25 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా. రైతులకు ఒకేసారి రుణమాఫీ చేసిన తీరులో ఉద్యోగుల విషయంలోనూ అదే పాలసీని అమలు చేస్తే ప్రతి నెలా ఆర్థిక భారం తప్పుతుందన్నది వారి ఆలోచన. దీంతో ఉద్యోగులు సంపూర్ణ తృప్తితో ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించగలరన్నది ఒక భావన. రెండేండ్లుగా కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు, సీఎం, డిప్యూటీ సీఎం, చీఫ్ సెక్రటరీ, ఫైనాన్స్ సెక్రటరీ తదితరులతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సమావేశమై వివరించారు.




## గత ప్రభుత్వ నిర్ణయంతో సంకటం

ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 ఏండ్ల నుంచి 61 సంవత్సరాలకు పెంచుతూ గత ప్రభుత్వం 2021లో నిర్ణయం తీసుకున్నది. దీంతో మూడేండ్ల పాటు రిటైర్‌మెంట్లు ఆగిపోయాయి. బెనిఫిట్స్ ఇవ్వాల్సిన అవసరం లేకుండాపోయింది. గతేడాది నుంచి రిటైర్‌మెంట్లు మొదలయ్యాయి. ఒకవైపు గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు చేసిన అప్పుల రీపేమెంట్, వడ్డీ చెల్లింపులు.. మరోవైపు ఉద్యోగుల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు ప్రస్తుత ప్రభుత్వానికి సంకటంగా మారింది. దీనికి తోడు గత ప్రభుత్వం ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతిలో జీతాలు చెల్లిస్తే ఇప్పుడు ప్రతి నెలా ఒకటో తారీఖునే చెల్లిస్తున్నది. నిధులను సర్దుబాటు చేయడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.

## రెండేండ్లుగా సంప్రదింపులు.. అయినా నమ్మకముంది



గత ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలతో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సమస్యలు తలెత్తాయి. యూనియన్లు, అసోసియేషన్ల మధ్య ఐక్యత దెబ్బతీసేలా చీలిక ప్రయత్నాలు జరిగాయి. వీటికి బాధ్యుల నియామకాలు నామినేషన్, అప్రూవల్ పద్ధతిలో జరిగాయి. ఫస్ట్ టైమ్ కార్యవర్గాలు ఎన్నికల ద్వారా ఏర్పడ్డాయి. ఇప్పుడిప్పుడే ఐక్యత పెరుగుతున్నది. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం గత రెండేండ్లలో సీఎం, డిప్యూటీ సీఎం, చీఫ్ సెక్రటరీ, ఫైనాన్స్ సెక్రటరీ, కేబినెట్ సబ్ కమిటీతో సంప్రదింపులు జరిపాం. మెడికల్ క్లెయిమ్, సప్లిమెంటరీ శాలరీ తదితర బిల్లులకు గ్రీన్ చానెల్ పేమెంట్స్ జరుగుతున్నాయి. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఐదారు నెలలుగా ప్రతి నెలా కొత్త మొత్తంలో విడుదలవుతున్నాయి. డీఏలు, పీఆర్సీ, ఈహెచ్‌ఎస్, పెండింగ్ బిల్స్ పేమెంట్.. ఇవన్నీ తొందర్లోనే పరిష్కారమవుతాయన్న నమ్మకముంది. సర్వీసు వ్యవహారాలపై అధికారుల స్థాయిలోని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మెకానిజం సరిగ్గా ఫంక్షన్ అయితే 80% సమస్యలు పరిష్కారమవుతాయి.

**- ఏలూరి శ్రీనివాసరావు,**
**తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు**

### పెండింగ్ డీఏలు ఇవే

| | |
|---|---|
| 01.01.2024 | 3.64% |
| 01.07.2024 | 2.73% |
| 01.01.2025 | 1.82% |
| 01.07.2025 | 2.73% |
| 01.01.2026 | వెయిటింగ్ |



### పుష్కర కాలంలో రిటైర్‌మెంట్లు ఇలా..

| సంవత్సరం | రిటైర్ అయిన ఉద్యోగుల సంఖ్య |
|---|---|
| 2014 | 10,958 |
| 2015 | 9,757 |
| 2016 | 10,226 |
| 2017 | 9,723 |
| 2018 | 10,277 |
| 2019 | 9,390 |
| 2020 | 8,143 |
| 2021 | 1,984 |
| 2022 | 2,068 |
| 2023 | 2,467 |
| 2024 | 8,956 |
| 2025 | 9,402 |
| 2026 | 9,990 (అంచనా) |

## హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీపై కన్‌ఫ్యూజన్

ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని (ఈహెచ్‌ఎస్) గత ప్రభుత్వం ప్రకటించినా అమలు లోపభూయిష్టంగా ఉన్నది. కార్పొరేట్ వైద్య సేవలు అందడంలేదనే అసంతృప్తి నెలకొన్నది. దీంతో ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వం మధ్య చర్చల అనంతరం ప్రతి ఉద్యోగి తన బేసిక్ శాలరీలో 1.5% మేర భరిస్తే అంతే మొత్తంలో ప్రభుత్వం చెల్లించి అందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని రూపొందించాలన్న అవగాహన కుదిరింది. కరోనా తర్వాతి పరిస్థితుల్లో మెడికల్ ట్రీట్‌మెంట్ ఖరీదైన వ్యవహారంగా మారడంతో ప్రైవేటు మెడికల్ ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకుంటున్నారు. ఆ పాలసీల ద్వారా అందే ట్రీట్‌మెంట్‌ను కంపేర్ చేసి ఇప్పుడు ఈహెచ్‌ఎస్ రూపకల్పన జరిగితే గందరగోళం తొలగిపోతుంది. ప్రస్తుతం మార్గదర్శకాల తయారీ ప్రక్రియ ముగింపు దశలో ఉన్నది.



## ఉద్యోగ సంఘాల్లో చీలికకు ప్రయత్నాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగ సంఘాల మధ్య ఐక్యత లేదన్నది ఒక సాధారణ అభిప్రాయం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న సమయంలో ఇక్కడి ఉద్యోగ సంఘాల్లో మెజారిటీ కలిసొచ్చాయి. కొన్ని అంటీ ముట్టనట్టుగా ఉండిపోయాయి. కానీ పుష్కర కాలం తర్వాత ఇప్పుడు 206 ఉద్యోగ సంఘాలు కలిసి జేఏసీగా ఏర్పడ్డాయి. ఒకే గూటి కిందికి చేరాయి. దీన్ని జీర్ణించుకోలేని కొందరు మాజీ నాయకులు చీల్చే ప్రయత్నం చేస్తున్నాయని ప్రస్తుత సంఘాల నేతలు గుర్తించారు. కొన్ని రాజకీయ పార్టీలూ ప్రేరేపిస్తున్నాయన్న అనుమానాన్ని వెలిబుచ్చారు. ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికే ఇలాంటి ప్రయత్నాలన్నది వారి రీడింగ్. ఈ మాయలో పడకుండా ఐక్యతను కొనసాగించుకుంటూనే డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం మీద ఒత్తిడి చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించాయి.

## బీఆర్ఎస్ హయాంలో జీతాలకే 2.30 లక్షల కోట్లు

కాగ్ నివేదిక ప్రకారం.. బీఆర్ఎస్ హయాంలో జీతాల కోసం రూ.2.35 లక్షల కోట్లు పెన్షన్ల కోసం రూ.1.25 లక్షల కోట్లు ఖర్చు చేసింది. మొత్తం సుమారు రూ.3.60 లక్షల కోట్లు జీతాలు, పెన్షన్ల కోసం ఖర్చు చేసింది. 2014–15లో మొత్తం ఖర్చు రూ.18,674 కోట్లు ఉండగా.. 2023–24 నాటికి అది ఏడాదికి రూ.60వేల కోట్లు దాటింది. తొమ్మిదిన్నరేండ్లలో ఖర్చు 3 రెట్లు పెరిగింది. రెండు పీఆర్సీల అమలు (2015లో 43 శాతం, 2021లో 30 శాతం ఫిట్‌మెంట్), 17 డీఏల విడుదలతో భారీగా నిధులు ఖర్చయ్యాయి.

| ఆర్థిక సంవత్సరం | జీతాల ఖర్చు (కోట్లలో) | పెన్షన్ల ఖర్చు (కోట్లలో) | మొత్తం ఖర్చు (కోట్లలో) |
|---|---|---|---|
| 2014–15 | 14,849 | 6,366 | 18,674 |
| 2015–16 | 16,334 | 7,497 | 23,831 |
| 2016–17 | 17,949 | 8,628 | 26,577 |
| 2017–18 | 19,771 | 9,411 | 29,182 |
| 2018–19 | 22,176 | 11,464 | 33,640 |
| 2019–20 | 21,961 | 12,530 | 34,491 |
| 2020–21 | 24,193 | 14,352 | 38,545 |
| 2021–22 | 31,525 | 16,634 | 48,159 |
| 2022–23 | 35,466 | 18,720 | 54,186 |
| 2023–24 (బడ్జెట్ అంచనా) | 39,127 | 21,203 | 60,330 |

కలం
ప్రజల గళం...
23-02-2026, సోమవారం
360° SINGLE TOPIC

# బెనిఫిట్స్-పెండింగ్

## పెన్షనర్ల జీవన్మరణ సమస్య

ఏటా సగటున తొమ్మిది వేల మంది ఉద్యోగులు రిటైర్ అవుతున్నారు. కానీ వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందడం లేదు. ఒకేసారి డబ్బులు వస్తాయని నమ్మకం పెట్టుకున్నారు. దానికి తగిన ప్లానింగ్ చేసుకున్నారు. సకాలంలో అందకపోవడంతో ఇబ్బందుల్లో పడ్డారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు చిక్కుల్లో పడ్డాయి. హోమ్ లోన్స్ ఈఎంఐలు కట్టడంలో బాధలు పడుతున్నారు. ప్రైవేటు అప్పులు తీర్చలేకపోతున్నారు. మెడికల్ ట్రీట్‌మెంట్‌కు డబ్బుల్లేక మదనపడుతున్నారు. మధ్యతరగతి మనస్తత్వం కావడంతో అవమానాలు ఎదుర్కొంటున్నారు. సొసైటీలో తలెత్తుకోలేకపోతున్నారు. ఇప్పటికే 60 మంది చనిపోయారు.



## వాయిదాల పద్ధతిలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్

రిటైర్ అయిన ఉద్యోగులకు వారివారి డిజిగ్నేషన్‌కు తగ్గట్టు బెనిఫిట్స్ అందుతాయి. సగటున రూ. 45 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందని అంచనా. ప్రతి సంవత్సరం సుమారు 9,000 మందికిపైగా ఉద్యోగులు రిటైర్ అవుతున్నారు. దాదాపు రూ. 7,000 కోట్లు ప్రభుత్వం సర్దుబాటు చేయక తప్పదు. కానీ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఐదారు నెలలుగా నెలకు రూ. 700 కోట్ల చొప్పున ప్రభుత్వం వాయిదా పద్ధతిలో చెల్లిస్తున్నది. గతేడాది రిటైర్ అయినవారికి ఈ ఏడాది.. ఈ సంవత్సరం రిటైర్ అయినవారికి ఆ తర్వాతి ఏడాదిలో క్లియర్ చేసే విధానం అమలవుతుండడంతో అటు ఉద్యోగులకు సంతృప్తి లేదు.. ఇటు ప్రభుత్వానికీ ఉపశమనం లేదు. పైగా ఇందులో రూ. 100 కోట్లు కోర్టు కేసుల తీర్పులకు, మంత్రులతో పైరవీలు చేసుకున్నవారికి, ఎమర్జెన్సీ కేసులకు పోతున్నదని అంచనా.



## చికిత్సకు పైసలు లేక..

ఖమ్మం జిల్లాకు చెందిన రిటైర్డ్ ఏఆర్ ఎస్సై మైసయ్య (60) చికిత్సకు డబ్బులు లేక ఈ నెల 19న కన్నుమూశారు. ఆయన నిరుడు ఫిబ్రవరిలో రిటైర్ అయ్యారు. మైసయ్యకు ముగ్గురు పిల్లలు. వారికి సరైన ఉపాధి లేక కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. మైసయ్య దంపతులిద్దరూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్సకు డబ్బులు లేక మైసయ్య మృతి చెందారు. ఆయనకు రిటైర్ మెంట్ బెనిఫిట్స్ రావాల్సి ఉంది. అవి వస్తే.. మైసయ్య బతికేవారని తోటి రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

## కీలకంగా ప్రభుత్వ నిర్ణయం


రెండేండ్ల కార్యాచరణ చూసిన తర్వాత ఉద్యోగులకు స్పష్టమైన అవగాహన ఏర్పడింది. ప్రభుత్వానికి ఆర్థిక కష్టాలున్నట్లే సకాలంలో బెనిఫిట్స్ అందకపోవడంతో ఉద్యోగుల కుటుంబాలకూ కొన్ని రకాల ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతానికి వారిలో అసంతృప్తి మాత్రమే ఉన్నా, అది సంతృప్తిగా మారుతుందా, లేక ఆందోళనవైపు వెళ్తుందా, లేక వ్యతిరేకతగా రిఫ్లెక్ట్ అవుతుందా, లేక ఆగ్రహ రూపం తీసుకుంటుందా.. ఇవన్నీ ప్రభుత్వ స్పందనపై ఆధారపడి ఉంటాయి. కేబినెట్ సబ్ కమిటీ మొదలు ముఖ్యమంత్రి వరకు వీటిని పరిగణలోకి తీసుకుని చేతులు కాలకముందే జాగ్రత్త పడతారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రాబోయేదంతా గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ వరంగల్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలు, ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల సీజన్ కావడంతో ఉద్యోగుల రోల్ కీలకంగా మారనున్నది.

## నిర్లక్ష్యం చేస్తే మూల్యం తప్పదా?

ఉద్యోగుల డిమాండ్లు, సమస్యల పరిష్కార విషయంలో గత ప్రభుత్వం ఉదాసీనంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పవర్ కోల్పోయి మూల్యం చెల్లించుకున్నదనే సాధారణ అభిప్రాయం ఉండనే ఉన్నది. రెండో పీఆర్సీని ఏర్పాటు చేసినా ఇంటెరిమ్ రిలీఫ్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకోవడంతో ఉద్యోగులు ఆ పార్టీ పట్ల నమ్మకం కోల్పోయారు. దీనికి తోడు కాంగ్రెస్ మేనిఫెస్టో ద్వారా ఇచ్చిన హామీని విశ్వసించారు. కాంగ్రెస్ పవర్‌లోకి వచ్చిన రెండేండ్లలో కొన్ని సాకారమైనా ప్రధానమైనవి కొలిక్కిరాలేదు. దీంతో రాబోయే అసెంబ్లీ ఎన్నికలనాటికైనా ఈ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుందని ఉద్యోగ సంఘాలు భావిస్తున్నాయి. మూడో పీఆర్సీని ఎన్నికలకంటే ముందే ప్రకటించడం, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించి ఫిట్‌మెంట్ హామీని ఇవ్వడం, వారిని కన్విన్స్ చేయడం.. ఇవన్నీ జరిగితేనే కాంగ్రెస్ పట్ల నమ్మకం కొనసాగుతుందన్నది వారి అభిప్రాయం.

## 15 లక్షల కుటుంబాల ఓటు బ్యాంక్

రాష్ట్రంలో మూడున్నర లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులతో పాటు మూడు లక్షల మంది పెన్షనర్లు, వేల సంఖ్యలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, టైమ్ స్కేల్, ఎన్ఎంఆర్, కంటింజెంట్, టెంపరరీ లాంటి కేటగిరీ ఉద్యోగులున్నారు. వీరికి తోడు కంప్యూటర్ ఆపరేటర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, రిసోర్స్ పర్సన్స్, ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం), సెర్ప్, మెప్మా, అంగన్‌వాడీ, ఆశా, హానరోరియం.. ఇలాంటి కేటగిరీ ఉద్యోగులూ ఉన్నారు. ఇలా అన్ని కేటగిరీల్లోని ఫిక్స్‌డ్ టైమ్ ఉద్యోగులంతా దాదాపు 15 లక్షలు ఉన్నట్లు అంచనా. ఇన్ని కుటుంబాల ఓటు బ్యాంకు ప్రతీ రాజకీయ పార్టీకి కీలకం. అందుకే ఎన్నికలకు ముందు పార్టీలు మేనిఫెస్టోలో హామీలు ఇస్తుంటాయి. గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలపై విశ్లేషణ చేసుకుని తీసుకునే నిర్ణయమే గెలుపు, ఓటమికి కారణమవుతుందన్నది ఉద్యోగ సంఘాల నేతల భావన.



## ఉద్యోగికి నెలకు రూ.20వేల లోటు బడ్జెట్

నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో తక్కువ జీతాలు వచ్చే ఉద్యోగులు తమ పిల్లల ఫీజులు, మెడికల్ ఖర్చులు, ఈఎంఐలు కట్టలేక నెలకు రూ.20వేల వరకు లోటులో ఉన్నట్లు ఉద్యోగుల సంఘాలు చెప్తున్నాయి. బకాయిలను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కోరుతున్నాయి. 2024తో పోలిస్తే నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, పిల్లల స్కూల్ ఫీజులు సుమారు 10 నుంచి 15 శాతం వరకు పెరిగాయి. కానీ, ఉద్యోగి జీతం మాత్రం పాత డీఏ రేట్ల వద్దే ఉంది. జీతం పెరగకపోవడంతో ఖర్చుల కోసం సగటు ఉద్యోగి నెలకు రూ.15 వేల నుంచి 20 వేల వరకు అప్పు చేయాల్సి వస్తున్నదని ఉద్యోగ సంఘాలు అంటున్నాయి.




## సీపీఎస్ ఉద్యోగులకిచ్చే హామీపైనే ఆశలు

రాష్ట్రంలోని మొత్తం రెగ్యులర్ ఉద్యోగుల్లో దాదాపు 60% మంది సీపీఎస్ (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) పరిధిలోకి వచ్చేవారే. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అన్యాయమైనదనేది ఆ ఉద్యోగుల వాదన. ఈ విధానానికి వ్యతిరేకంగా హైదరాబాద్ మొదలు ఢిల్లీ వరకు నిరసనలు చేస్తూనే ఉన్నారు. దీనిని ఎత్తివేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను కొనసాగించాలన్నది వారి డిమాండ్. ఇప్పటివరకూ ఏ రాష్ట్రంలోనూ సీపీఎస్ సంపూర్ణంగా అమలు కాలేదు. కేంద్ర ప్రభుత్వం సైతం సీపీఎస్‌కు బదులుగా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌నే అమలు చేస్తున్నది. చత్తీస్‌గఢ్, జార్ఖండ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్.. ఇవన్నీ సీపీఎస్, ఓపీఎస్ పాలసీల్లో ఉద్యోగుల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. తెలంగాణ కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీపీఎస్‌ను ఎత్తివేయనున్నట్లు మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. దాన్ని ఉద్యోగులు విశ్వసించారు. రెండేండ్లలో దాని ఊసే ఎత్తకపోవడంతో ఉద్యోగులు డైలమాలో పడ్డారు. ఇప్పుడు ఈ విషయంలో ప్రభుత్వం ఏ వైఖరి తీసుకుంటుందన్నది ఉద్యోగుల భవిష్యత్తుతో పాటు కాంగ్రెస్ ఫ్యూచర్‌నూ డిసైడ్ చేయనున్నది.



## ఐదేండ్లకోసారి పీఆర్సీ



పే రివిజన్ కమిషన్( పీఆర్సీ) పెరుగుతున్న ధరలు, జీవన ప్రమాణాలు, ఆర్థిక పరిస్థితులకు తగ్గట్టు ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలను సమీక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఐదేండ్లకోసారి నియమించే ఒక ప్రత్యేక కమిషన్ ఇది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినప్పుడు, పాత జీతంతో బతకడం కష్టమవుతుంది. ఆ ఆర్థిక వ్యత్యాసాన్ని తగ్గించడానికి జీతాల సవరణను ఈ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది.

## ఆరు నెలలకోసారి డీఏ

'డియర్నెస్ అలవెన్స్' (కరువు భత్యం – డీఏ). నిత్యావసర వస్తువుల ధరలు (ద్రవ్యోల్బణం) పెరిగినప్పుడు, ఉద్యోగుల జీవన ప్రమాణాలు దెబ్బతినకుండా ప్రభుత్వం ఇచ్చే అదనపు భత్యం ఇది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ప్రభుత్వ రంగ సంస్థల సిబ్బందికి డీఏ చెల్లింపు ఉంటుంది. పెన్షనర్లకు ఇచ్చే దాన్ని డీఆర్ (డియర్నెస్ రిలీఫ్) అని పిలుస్తారు. ఆలిండియా కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (ఏఐసీపీఐ) ప్రాతిపదికన డీఏ పర్సంటేజ్ ఫైనల్ అవుతుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫార్ములా ప్రకారం గత 12 నెలల ధరల సగటును బట్టి ఏడాదికి రెండు సార్లు (జనవరి, జులైలో) డీఏ సవరణ ఉంటుంది.